# అర్థ మొగుడు

సాయంత్రం ఆరు గంటల వేళ అనూరాధ హాల్లో పడక్కుర్చీలో పడుకున్నట్లు కూచుని "జ్యోతి" చదువుతోంది.

గేటు తీసిన చప్పుడు. ఎవరో వస్తున్న చప్పుడు చెవులకు సోకింది విసుగ్గా తలెత్తి చూసింది. చటుక్కున లేచి నిలబడింది. వెంటనే బయటికి వచ్చింది.

ఒకమ్మాయి! తన ఈడుదే! తన కన్నా తెల్లగా ఉంది. గుండ్రని ముఖం, నవ్వే కళ్ళు!

"ఎవరు?" అని అడగా లనుకున్న అనూరాధ "రండి" అన్నది. "ఇదేమిటీ, ఇలా అన్నాను?" అని ఆశ్చర్యపోయింది కూడా.

ఆ అమ్మాయి లోపలి కొచ్చింది.

"కూర్చోండి!" అంది అనూరాధ.

ఏం మాట్లాడాలి? ఎవరో తెలీదు. కనీసం ఎప్పుడన్నా చూసినట్టుగూడా లేదు. అయినా, ఇందాకే అడగవలసింది. ఖర్మ! చూడబోతే అల్లరి పిల్లలాగా ఉంది. "ఎవరు?" అనడిగితే, "ఇప్పు డడుగుతున్నారా?" అంటే? తనకే సిగ్గు. అనే రకమే!

"ఒక్కసారిలా ఇవ్వండి ఆ జ్యోతి" అందామ్మాయి. ఇచ్చింది.

"మీరు బి. ఏ. చదువుతున్నారు కదూ?" సూటిగా చూస్తూ అడిగిందామ్మాయి.

ఒక్కసారి చుట్టూ చూసింది అనూరాధ.

డ్రాయరుమీదనుంచి 'ఫార్ ఫ్రమ్ ది మాడింగ్ క్రౌడ్' తొంగి చూస్తోంది. అయినా, చూద్దాం అని —

"మీకెలా తెలుసు!" అడిగింది.

"నాకు తెలుసు" అందామ్మాయి.

"ఏం? చదువుతున్నాననే ఎందుకనుకోవాలి? అయిపోయిందనుకో వచ్చుగా!"

"ఇలా చూడండి! అదుగో, మీ ఇంగ్లీషు నాన్డీటెయిల్డు పెట్టు. అది సెకండ్ ఇయర్ ది. కాబట్టి మీరిప్పుడు చదువుతున్నారు" ఘంటాపథంగా అన్నట్టు చూసింది.

"ఏం? నేను కంప్లీటు చేసి ఉండొచ్చుగా బి. ఏ.?"

"అయితే, ఆ పుస్తకం అక్కడ ఉండదు."

"ఎందు కలా అనుకున్నారు?" ఆశ్చర్యంగా అడిగింది.

---

రెండవ బహుమతి రూ. 25/-

కుమారి పి. శ్రీకళ

బి. ఏ. మొదటి సంవత్సరం,
ఉమెన్సు కాలేజి, గుంటూరు.

ఒక్కసారి వింతగా చూసి ఇలా అందామ్మాయి : "కంప్లీటు చేసినప్పుడు ఇంక క్లాస్ పుస్తకాలు మళ్ళీ పట్టుకునే వాళ్ళు ఎంతోమంది ఉండరు. ఒకవేళ ఉన్నా, ఆసక్తి ఉంది అనుకునేవాళ్ళయితే ఆ పుస్తకం అలా, ఆ రకంగా ఉండదు."

అనూరాధ ఒక్కసారి తన అట్ట చిరిగిపోయిన పుస్తకాన్ని చూసి సిగ్గుపడింది. ఆ అమ్మాయి వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోయింది.

"ఏం! కోపం వచ్చిందా?"

"లేదు."

"అదేమిటో - అనుకున్న మాట వెంటనే చెప్పడం నా కలవాటు."

"అదే నా కిష్టం."

"ఇంతకీ నేను చెప్పింది కరక్టేనా"

"నూటికి నూరు పాళ్లా కరెక్ట్. నేను బి. ఏ. సెకండియర్ చదువుతున్నాను."

కాసేపాగి—

"అవునూ - నేను బి. ఏ. అనే ఎందు కనుకున్నారు?" ప్రశ్న అనూరాధది.

"మీరు తీరిగ్గా జ్యోతి చదువుతున్నారు గనుక." నవ్విం దామ్మాయి. మళ్ళీ విశ్శబ్దం.

"మీరు బి. ఎస్‌సి. అనుకుంటాను" అడిగింది అనూరాధ.

ఈసారి ఆశ్చర్యం ఆ అమ్మాయిది.

"అహఁ, ఏంలేదు మీరలా అన్నప్పుడు మీ ముఖంలోని భావాలవలన కనుక్కున్నాను" అన్నది. అనూరాధ కళ్ళల్లో హాస్యరేఖ తొంగి చూస్తుండగా.

"మీరు భలేవారేనే!" అంది ఆ అమ్మాయి.

"ఉండండి. ఇప్పుడే వస్తా" లోపలి కెళ్ళింది అనూరాధ.

కాసేపట్లో కాఫీ కప్పులతో ప్రత్యక్షమయింది.

"ఏమిటండోయ్, ఇప్పుడీ మర్యాదలన్నీ!" అందామ్మాయి.

"ఫరవాలేదు. కాఫీయేగా!"

"నాకు ఉత్త కాఫీ తాగే అలవాటు లేదే!" కొంటెతనం కళ్ళల్లో.

"అయితే, క్షణం ఉంటారా? ఉప్మా చేసి తెస్తాను"

"అమ్మో! క్షణమే? అయినా, నాకు ఉప్మా సయించదు."

"అయితే, కాఫీ ఒక్కటే తాగండి. ఆదే మీకు శిక్ష!" కూచుంటూ అంది.

"అన్యాయం! ఇదేం మర్యాదండీ! ఉప్మా సయించదంటే ఇంకేమన్నా చేసి పట్టావాలిగానీ!"

"త్వరగా అయ్యేది ఆదే! మిగతావి చెయ్యడమంటే తలనొప్పి నాకు. గంటలకొద్దీ కూచోవాలి పొయ్యిదగ్గిర."

"అయితే, మనిద్దరి పాలసీ ఒకటే

ఉన్నమాట! నాకూ తలనొప్పి ఈ వంటా వార్పూ అంటే!"

"అవును. బోరు! పొయ్యి దగ్గర కూచోడం."

"అవును. నాకూ బోరే! కానీ. మా అమ్మ వినదు. నాచేతే చేయిస్తుంది."

కాఫీలు పూర్తయ్యాయి. కప్పులు ఆ పక్కనే పెట్టింది అనూరాధ–లోపల కూడా పెట్టకుండా.

"చాలా సేపయిందండీ వచ్చి" టైము చూసుకుంటూ అందామ్మాయి.

"ఇంక వస్తాను! మీ ఆదరణకి చాలా థాంక్స్. ఇప్పుడు బస్సు వస్తుంది కదూ!" నడుస్తూనే మాట్లాడుతోంది.

"అప్పుడప్పుడూ వస్తూ ఉండండి. ఈ కాసేపట్లోనే మీరు నా ప్రాణ మిత్రురా లయినారు. అదేమిటో!" వెంట వెళ్తూ అంది అనూరాధ.

"అలాగే. నాకూ అలాగే ఉంది. ఫరవాలేదు. ఎలాగూ మళ్ళీ కలుస్తాంగా గుడ్ నైట్!"


"గుడ్ నైట్." వెళ్ళిపోయింది.

* * *

"ఎవరే వచ్చిందీ?"

అమ్మ అడిగింది వస్తూ గుడినుంచి.

"అరే! పేరే అడగలేదే? తన మతి



మరుపుకి తనకే నవ్వొచ్చింది. గంట సేపు మాట్లాడారు కదా! ఎవరోకూడా తెల్సుకోలా తను. కనీసం ఇంతకీ తనెవరో తెలుసా ఆ అమ్మాయికి? తెలీకపోతే ఎందుకొస్తుంది ఇక్కడికి? అసలు ఎందుకొచ్చింది? ఏం పని తనతో? కనీసం తన పేరన్నా తెలిసినట్టు లేదు. ఎలా వచ్చింది?

"ఎవరే అంటే మాట్లాడవేం?"

తల్లి మళ్ళీ రెట్టించేప్పటికి ఈ లోకంలోకి వచ్చి 'ఏమో!' అంది. 'సరేలే!' నవ్వుకుంటూ వెళ్ళింది తల్లి లోపలికి.

* * *

నెలరోజులు గడిచాయి. ఆ సంఘటనే మర్చిపోయింది అనూరాధ. ఆ రోజు వచ్చింది నాన్నకి ఉత్తరం. అంతకి రెండు నెలల్రికితమే చూచి, ఉత్తరం రాస్తామని వెళ్ళిన పెళ్ళివారి దగ్గిర్నించి! అదీ సంతోష వార్తతో "పిల్లనచ్చింది, ముహూర్తం పెట్టించ"మని! ఇంట్లోవాళ్ళ ఆనందానికీ — హడావిడికీ అంతులేదు.

పెద్ద ఇంటివారు, ఆస్తి కలవారు. అబ్బాయి చదువుకున్నవాడు, అందగాడు! ఇంకేం కావాలి?

ముహూర్తం నిశ్చయించేశారు. పదిహేను రోజులుంది పెళ్ళి ఇంక.

ఆ రోజు అనూరాధకి ఉత్తరం వచ్చింది. రాత చూస్తే క్రొత్తగా వుంది. ఎవరు రాశారు? ఎవరై ఉంటారు! ఆలోచిస్తూ కవరుచించింది. ఒకఫొటో! ఆ అమ్మాయి!! గంటసేపు పేరేమిటో గూడా తెల్సుకోకుండా మాట్లాడిన, మాట్లాడుకున్న స్నేహితురాలు! ఒకేసారి ఆనందం, కుతూహలం కలిగాయి! అలాచూస్తూ ఉండిపోయింది చాలాసేపు. నవ్వే కళ్ళు! గుండ్రని మొహం! ఎంతసేపో చూసింతరువాత ఫొటో కవర్లో పెట్టబోయి అందులో ఉన్న ఉత్తరాన్ని అదే ఒక కాయితాన్ని అప్పుడే చూసి తీసి చదివింది!

"అనూరాధాదేవీ,

నేనే? నాపేరూ.... ఏమనుకుంటున్నావు! నేనెవరో నీకు తెల్సు కానీ అడ్రసూ, ఊరూ! ఊహూఁ! అదే నస్పెన్సు!! నాపేరు మధురిమ. నీ మేరేజికి నేను తయారు.

విష్ యు గుడ్ లక్,

ఇట్లు,
అర్ధ మొగుడు.

(అంటే - అర్థం తెలుసుకదూ?)"

కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ఉండిపోయింది అనూరాధ.

**